Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

# రాయలసీమలో ఒక నాటి 'వన' విశేషాలు

**– అంకే శ్రీనివాసులు,**
తెలుగు అధ్యాపకులు,
ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి),
అనంతపురము.
Mobile: 9652471652
email:ankesreenivas@gmail.com

మధ్యయుగ తెలుగు సాహిత్యంలో ప్రబంధానికి అష్టాదశవర్ణనలు ఒక ప్రత్యేక లక్షణంగా భావించేవారు. ఆష్టాదశ వర్ణనలలో వన వర్ణన కూడా ఒకటి. వన వర్ణనలో అడవి వర్ణన, ఉద్యాన వన వర్ణనలు ప్రబంధాలలో విస్తృతంగా కనిపిస్తాయి. అడవుల్లోని రకరకాల చెట్లు, తీగలు, దుంపలు, జంతువులు, పక్షుల వంటి వాటి గురించి కవులు ప్రత్యేకంగా రాసారు. వీటి గురించే కైఫియత్తులు కూడా నమోదు చేశాయి. ఆనాటి రాయలసీమలో జీవించిన కవులందరూ అడవులను వర్ణించారు. ఆ వర్ణనలు కైఫియత్తులు నమోదు చేసిన విషయాలతో సరిపోలుతున్నాయి. అంతేగాక ఆ జంతు పక్షిజాలాన్ని, వృక్షజాలాన్ని రాయలసీమ మాండలిక భాషలో చెప్పడం విశేషం.

**సిద్ధవటం మాహాత్మ్యం** గురించి చెప్పిన కైఫియత్తులో అడవిలోని వివిధ రకాల వృక్షాలను గురించి స్పష్టంగా వివరించారు.

**గృహాలకు ఉపయోగపడే వృక్షజాతులు**

| | | |
|---|---|---|
| చందనం | వెలమ | బిళ్ళు |
| మునకలివి | చీరు | వెదురు |
| యిప్ప | యెపె | నక్కనలు |
| యినుమద్ది | తపశి | సోమలు |
| తుమికి | తెంకు | |

**ఫలవృక్షాలు (స్వామికి, యిండ్లకు ఉపయోగపడేవి)**

| | | | |
|---|---|---|---|
| వూడి | బలుసు | బీర | తూంకి |
| బిక్కి | బజనిక | దేవదారు | బొడిమిడి |

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

| | | | |
|---|---|---|---|
| మేడి | పాల | కేర | మోవి |
| చింత | యీత | వెలగ | రేగు |
| మారేడు | వలువింద | మామిడి | తాటి |

**ఔషధ సంబంధమైన వృక్షాలు**

| | | | |
|---|---|---|---|
| కారుమునగ | మునిమోదుగ | ఉసిరి | నల్ల ఉసిరి |
| రాంముల్కి | నల్లవుల్కలి | మంచిమునగ | తెలవిచీర |
| విషబొద్దె | చిత్రమూలం | యీశ్వరి | నూగుదోస |
| ఆకుజముడు | గుగ్గిలం | చంద్ర | |

'గరళిగంధం చెట్లకు వాసన లేదు' అని ప్రత్యేకంగా కైఫియత్తులో వుండడాన్ని బట్టి సువాసన వచ్చే మరోరకం గరళిగంధం చెట్లు కూడా ఉన్నాయని అర్థమౌతుంది.

ఈ ఔషధ వృక్షాలతో చేసే కంటివైద్యాన్ని ధూర్జటి ఇలా వర్ణించాడు

సీ॥ కోకపొట్లంబావి గొననూది యెత్తుచు గషణోష్ణకరభ భాగమునఁ గాఁచి
నెత్తితంగేడాకు మెత్తి రేచకి నిమ్మపంటివుల్సున నూఱి పట్టువెట్టి
తెల్ల దింటెన పువ్వు దెచ్చి తద్రసమిడి కలివెపువ్వులు గోసి నలచిపిడిచి
పేరిన నెయ్యివెట్టి పెరుగు వత్తులు వైచి చనుబాలతో రాచి సంకుచమిరి

తే॥ విన్న మందులు తాసరికన్న మందు, లడిగి తెచ్చిన మందులు నడవిమందు
లెన్నిచేసిన మానక యిందుమౌళి, కన్ను తొడింబడి నెత్తురు గాఱుటయును

అని తిన్ననితో శివుని కంటి గాయానికి వైద్యం చేయించాడు ధూర్జటి.[1]

ఇలాంటి ఉదాహరణలు విరివిగా ప్రబంధ సాహిత్యంలో లభిస్తున్నాయి.

ఉసిరి, నల్లఉసిరి అనే రెండు రకాలను కైఫియత్తులలో ప్రస్తావించారు. వీటిని ఔషధంగాను మరియు వంటలలోను ఉపయోగించేవారు.

ఔషధానికి ఉపయోగపడే చెట్లను ధోడియం కైఫియత్తులో కూడా చెప్పారు. బిల్వపత్రి, ముష్టి, కరక్కాయ, తాండ్రవి, మెలిమి, మోదుగ, చీకరేణి, నగరి, చీలనేల, కొర్వికట్టె, మడియర, పొలికి, తడివి, బూరగవి మొదలైనవి. వైద్యుడు తయారుచేసే ఔషధ పరిశ్రమను హంసవింశతి ఒక సుదీర్ఘమైన వచనంలో వివరించింది[2] అనేకమైన చూర్ణాలు, వివిధ రకాల లేహ్యాలు, రసాయనాలు, రకరకాల

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఔషధాల ప్రస్తావన ఆ వచనంలో ఉంది. ధూర్జటి కంటివైద్యం, కంటి వైద్యంలో ఉపయోగించే ఔషధ ద్రవ్యాలను చెబితే నారాయణామాత్యుడు ఆనాటి అనేకమైన వైద్యపద్ధతులను వివరించాడు. ఘృతాలు, లేహ్యాలు, తైలాలు, దివ్యరసౌషధాలు, గంధకం, రసం, నాభి వంటి వాటి లక్షణాలు, వంటి వాటి గురించి చెప్పాడు. 72 నాడీభేదాలు, శీతపైత్యశ్లేష్మాల ఉల్బణాలైన 360 రోగాలకు చేసే వైద్య విధానాలను తెలియజేశాడు.

వీటితోపాటు **ధోడియం కైఫియత్తు**లో మరికొన్ని వృక్షాల వివరాలున్నాయి

| | | | |
|---|---|---|---|
| చిగురుచెట్లు | పులుచచెట్లు | పెణుతురు చెట్లు | పరికిచెట్లు |
| కలిమిచెట్లు | యాదచెట్లు | జానచెట్లు | పలవరేణిచెట్లు |
| గొటికిచెట్లు | నీరుద్దిచెట్లు | పెద్దజముకు | కొండ జిల్లేడు |
| సన్నజముకు | కొండజలడి | బొగ్గెలి తుమ్మచెట్లు (బహుశా నల్లతుమ్మ) | |

**చెన్నూరు వృత్తాంతం**లో రెలగవి, సారపప్పు, కొండములక మొ॥ చెట్లు వున్నాయి.

**పాయకట్టు కైఫియత్తు**లో మరింత వృక్షసమాచారం వుంది

| | | | |
|---|---|---|---|
| ఇనుమద్ది | పాలబరిగె | కొలముక్కి | సన్నజముడు |
| కర్క | చిరిమామిళ్ళు | తడచెట్లు | చారచెట్లు |
| తంబుగ | మంగ | టేకు | బీదలు |
| నెమలి అర్గ | గుమ్మ | బొండజెముడు | రావులు |
| అల్లి | ఆకుచెముడు | దేవదారు | |
| గొట్టి | కొండశనగ | | |

**రావులకొల్లు వృత్తాంతం**లో మరికొన్ని చెట్లువున్నాయి

| | | | | |
|---|---|---|---|---|
| పొడపత్రి | కొండకంది | పచ్చార్లు | సుగంధపాల | |
| కొండపసుపు | దుత్తెలు | ఈశ్వర | కొండప్రత్తి | |
| సామిరి | విషబొద్ది | పైండి తంగేడు | దుద్రకలప | |
| రుద్రకడప | దిరిశెన | అల్లి | తప్పిశ | |
| వెలుతురు | ఉంటిచెట్లు | బొట్టకడప | నేలతంగేడు | |
| తూకిచెట్లు | పులివెలగ | నగరి | మారేడు | ఎర్రవాలుకు |

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

అనేక వృక్షరకాల పేర్లను సిద్ధవటం, ధోడియం, చెన్నూరు, పాయకట్టు, రావులకొల్లు కైఫియత్తులతో పాటు కావ్యాలూ రాశాయి. నారాయణామాత్యుడు తన హంసవింశతిలో వృక్షజాతులపేర్లను ఒక సుదీర్ఘ సీసమాలికలో రాశాడు.

సీ॥ రావి మామిడి కొండరావి మేడియు బ్రహ్మమేడియు జీడిమామిడియు జింత
పులిచింత మోదుగు ములుమోదుగును వెల్గ పుల్లవెలగ వెఱ్ఱి చిల్లచిల్ల
బూరుగ కలుగొట్లు భూతపాదరి కుక్కబూరుగ చిటిగొట్టి భూతనెండె
నేరేడు మఱి యల్లనేరెడు పాదిరి తడ గూబతడ టేకు కడపబట్ట
కడపకొడిశ పాలకొడిశెఱ్ఱలొద్దుగు చిఱుటే కు లొద్దుగు జీడిపాల
కలుజువ్వి వావిలి కొండవావిలి మద్దినుమద్ది నీరుద్ది యుద్ది
తెల్లకాంచనము తుందిల మెఱ్ఱకాంచన ముప్పి తెల్లుప్పి నీరుప్పియిప్ప
తాంద్ర చందనమేపి దాసానమెఱ్ఱ దాసాసనము చిందుగ జారజేన
మఱ్ఱివిరికి తొండ్లి మఱ్ఱి తూకిబ్బెడ పెద్దవిరిగి పక్కి గద్దనెల్లి
కాకితూకందుగు కానుగవరగోగు గోడు బొట్టుకబిక్కి గోగుకొండ
గోఁగు పొగడ ములుగోరంట గోరంట వెలమ సుంకేసరి వెఱ్ఱిబిక్కి
కొండగుమ్ముడు రేగు గొరవి సంపంగి కొండసంపెంగ మారేడు సరళదేవ
దారు గుమ్ముడుమోవి తప్పిసి కుమ్మర పోల్కి గుగ్గిల మెఱ్ఱపోల్కి వేగి
దేవదారుసిరికె తిలకము తెల్లనగిరి వేప కరివేప తురకవేప
వేరుపనసగుత్తి వెఱ్ఱినారువరేల పనస కరకకొమ్మిపలువరేణి
బండచింతయు నల్లబలుసు సురభి చీకి రేని కూకుడు నెమ్మి ప్రేంఖణమ్ము
భూతాంకుశమశోక భూర్జపత్రమ్ములు బోళము మంకెన పులును గంగ
రేగు తక్కిలి ములువేగి భూచక్రము మొక్కపు కొక్కెసమొల్లమ్రాను
హనుమంతబీర మంకెన గిరికర్ణిక పెడమల్లె కొండముక్కిడియు గోల
ముక్కు దాడిమ బీర మొగలింగ గోదాడు నేదాడు ఖర్జూర మీతనేల
తాడిబగ్గిస పోకతాడు కొబ్బరిచెట్టు పెద్దమాను పతంగి బెండ గలుగు

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

తే.గీ. కణుదు రిరుగుడు కాలుగ కాన్గ సన్న
విరిగి సోమింద గున్నంగి దిరిసెనంబు
మొదలుగా గల్గు బహువిధ భూరుహములు
నిండియుండెడు కానల పిండు లరసి[3]

బహువిధాలైన ఈ భూరుహాలలో కొన్నిపేర్లు పునరుక్తమయ్యాయి. కొన్నిచెట్లు, కొన్ని ఆకుకూరలు, కొన్ని తీగలూ ఇందులో ఉన్నాయి. ఈ సీసమాలిక 161 రకాల వృక్ష, చెట్ల పేర్లు ఉన్నాయి. ఇన్ని చెట్ల పేర్లను నమోదు చేయాలనే కవి ఆలోచన చాలా గొప్పది. ఈ ఆలోచనను అమలు చేయడానికి కవి పడిన కష్టం అర్థమవుతోంది. 'నేదాడు ఖర్జూర మీత నేల" పాదంలో యతి ప్రాసయతి లేవని హంసవింశతి వ్యాఖ్యాత కోగంటి వేంకటాచార్యులు చెప్పిన మాట వాస్తవం. ఖర్జూరము, ఈత ఒకే జాతి చెట్లే, కానీ ఖర్జూరము చెట్లను ఆరోజులలో రాయలసీమలో పండించేవారు కాకపోవచ్చు. అయితే ధూర్జటి చేసిన భయంకరమైన కరువు వర్ణనలో ఈత గడ్డను తిని ప్రజలు ప్రాణాలు నిలుపుకొన్నారని చెప్పాడు. రాయలసీమ కరువులో ఈతగడ్డ తినడం అనాదిగా వుంది. ఈత చెట్టు సుడిభాగంలో తెల్లగా ఉండే గడ్డలాంటి పదార్థం తీయగా ఉంటుంది.

161 పేర్లలో కొన్ని సంస్కృత పేర్లున్నాయి.

**చిల్లర వృక్షాలు**

| | | | | |
|---|---|---|---|---|
| మొగబీరది | ఉత్తరేణి | తంగేడు | నెలవేము | కారుగోగు |
| కరేపాకు | నల్లేరు | వుస్తె | చిల్ల | కరక |
| ఆదొండ | అడవిదొండ | వరగోగు | కూతురుబుడమ | చేడిబీర |
| నల్ల వుప్పి | కన్యకోమరి | జీడి | యఱ్రపొల్కి | దిరిశనం |
| తాండ్ర | నెలవేము | శతపత్ర | వెఱ్రిగొలుగు | ముష్టి |
| గురవి | వెఱ్రిపుచ్చి | పొలికి | కలగలి | తడా |
| పచ్చారి | బందారు | గొలుగు | కొండవావిలి | నల్లవావిలి |
| ఉసినిగె | శాండ్ర | యవలి | బొడగడప | పుల్సుకుమిది |
| చీకిరేణి | కోరింద | కొండకశ్మి | | |


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in


**సిద్ధవటం కైఫియత్తు**లో ప్రత్యేకంగా పైచిల్లర వృక్షాలుగా ఉదాహరించినట్లుగానే హంసవింశతిలో చిఱుచెట్లుగా నారాయణామాత్యుడు కూడా చెప్పాడు. ముందు చెప్పిన వృక్షజాతులకు ముందు ఒక సీసమాలికలో అనేకమైన చిఱుచెట్ల పేర్లను వివరించాడు.

సీ॥ జిల్లేడు వెంపలి జిడ్డువెంపలి పైడితంగేడు తంగేడు తగిరి నుస్తె
ములు వెంపలి ములుస్తె గలిజేరు గుంటగల్జేరును దంతి బందారి నేల
తంగేడు మెట్టబందారి దుండుగ బ్రహ్మదండి భూతుల సెల్లదండిచల్ల
పిల్లి మూడుపుచెంగ పిల్లడ్గు చిత్రమూలము నల్లతీగె కోలాకుపొన్న
ముయ్యాకు పొన్నయు మొగబీఱ తుత్తెర బంక దుత్తెర హంసపాదిగంట
కామ జీలుగు మెట్టదామర వెట్టిసెనగ జంబిరము కాచి నల్లకాచి
శ్రీతులసియు సంబరేణు నేలుసిరి కేశ్వరి నేల వేమూటి చల్లగడ్డ
సహదేవి జుట్టుప చలిపిండి చిటముటి పెన్నేరు విషబొద్ది పిండిదొండ
నెమటాయి గొలిమిడి నీరుబచ్చలి ప్రబ్బివేరు గన్నేరాడుబీఱనేతి
బీర పేరాముటి పీచరములు గొలిమిడి చేదుపొట్ల యుమ్మెత్త తిప్ప
తీగె విష్ణుక్రాంత తీండ్రెల్ల చిత్రమూలము దొండతీఁగె ముల్లంగి గొల్ల
జీడెద్దు మట్టేకు చేగొడ్త చంద్రకాంతెల్లని యబ్బెంద యెల్లతుమ్మి
కుప్పి సూర్యక్రాంత ముప్పుడు నరవంజ గాడిదెగడపర కన్నెకొమర
నల్లగెంటెన పూలి తెల్లగెంటెన యుత్తరేణు గుబ్బిరి సంబరేణుబండి
గురిగింజ గురువింద తురకపత్తియు బత్తి తిలపిడ చబ్బెంద చెలివిచీకి
వెలగ విషమదారి వెట్టికుందెన మంచికుందెన కలబంద గువ్వగుత్తి
మామెనయును నేలమామెన యటకమామిడి దూల గోవెల మేక మేయ

తే.గీ. నాకు నల్లేరు నులిజెముడాకు జెముడు
నేల తీట కసిందెయు గోలచెముడు
బొంతచెముడుల్లియును సదాముస్తె మొదలు
గా గలుగునట్టి చిఱుచెట్ల గాంచియండ [4]

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

ఈ పద్యం ఆరవ పాదంలో 'వెట్టిసెనగ' అనే చిఱుచెట్టు ప్రస్తావన ఉంది. అది వేరుశనగ. వృక్షజాతుల్లో ఉన్నవి కూడా చిఱుచెట్లు, కాయగూరలు, ఊరగాయలలోనూ ఉన్నాయి. శనగపంట ప్రాచీనకాలం నుండీ ఉంది. వేరుశనగను మాత్రం పోర్చుగీసులు భారతదేశంలో ప్రవేశపెట్టారు. పై సీసమాలికలో చెప్పినచెట్లలో నేలఉసిరి, ముల్లంగి, పత్తి వంటివి పొలాల్లో పండించేవి. ఔషధ వృక్షాలుగా సిద్ధవటం వంటి కైఫియత్తుల్లో చెప్పిన ఉసిరి, నేలఉసిరి, చిత్రమూలం, ఈశ్వరి వంటివి కూడా పై సీసమాలికలో ఉన్నాయి. అందువల్ల ఇక్కడ చెప్పిన వెట్టిశనగ వేరుశనగే అనడంలో సందేహం లేదు. వేరుశనగ ప్రస్తావన చేసిన మొదటి కవి నారాయణామాత్యుడు.

పదమూడవరాత్రి కథ చెబుతున్న హంస భూలోకం చూడటానికి వచ్చానని, తాను చూసిన చెట్లు, చెట్లతోపాటు కంపజాతుల్ని కూడా చూశానని చెప్పింది. కంపజాతుల్ని ప్రస్తావించిన తర్వాతనే వృక్షాలు చెట్ల పేర్లను హంస తెలియజేసింది. 41 రకాల కంపచెట్లను గూడా నారాయణామాత్యుడు చెప్పడం విశేషం[5] "కోరింద, నల్లతుమ్మ, కొటికెజోడు, వెణుతురు, ఊడుగ, దంతి, వెర్రినిమ్మ, చిటిగార, సుందరి, పరికి, తెల్లవుప్పి, లొద్దుగ, జిడ్డుతమ్ము, బుడ్డతుమ్మ, గచ్చ, పెన్మంగ, దుడ్డుమంగ, భూత, తొట్రుకోలె, మాడ్పు, చిటికొక్కి, సీకాయ, మండ్ర, తొర్ర, వెలగ, వాకుడు, పల్లేరు, ములక వేప, నగరి, నీర్గొబ్బి" మొదలగు చెట్లు ముళ్ళను కలిగి వుంటాయని హంస చెప్పింది. సీకాయ చెట్టు కాయను ఎండబెట్టి పొడికొట్టుకొని స్నానం చేసే సమయాల్లో ఉపయోగించేవారు. అళ్ళిందకళ్ళి లేదా కళ్ళి చెట్లను పొలాలకు కంచెగా నాటుకొనేవారు. ఇవి పాలు కారుతాయి. కళ్ళి చెట్టుకు సాధారణ ఆకులుండవు. పచ్చని పుల్లల రూపంలో ఆకులుంటాయి. తాడి, ఈత చెట్ల నుండి మద్యం తయారు చేసేవారు. మధ్యయుగంలో వీటి సరసన తెల్లతుమ్మ చెట్టు కూడా వచ్చి చేరింది. ధోడియం కైఫియత్తులో బొగ్గెలితుమ్మను (నల్లతుమ్మ) చెప్పారు. ఇది వ్యవసాయ పనిముట్లకు ఉపయోగపడుతుంది. తెల్లతుమ్మను మద్యం కోసమే ఉపయోగిస్తారు. "తెల్ల తుమ్మ సారాయిరా, తాగితే కైపాయరా" అని రాయలసీమలో ప్రసిద్ధ జానపద గీతం వుంది. చీకి చెట్లను పోర్చుగీసులు బ్రెజిల్ నుండి మన దేశంలోకి ప్రవేశపెట్టారు. ఇవి దేశమంతా విపరీతంగా విస్తరించాయి. వీటిని జాలిచెట్లు, కంపచెట్లు, సర్కారీ చెట్లని పిలుస్తున్నారు. వీటిని ఇళ్ళకు, పొలాలకు కంచెలుగా ఉపయోగించేవారు.

నారాయణామాత్యుడు తీగజాతులను కూడా చెప్పాడు. "పిల్లపీచర, నక్కపీచు, ఎలకచెవి, గొర్రెపాల, మేకపాల, బుడ్డకాసర, బొంతిదొంతర, మాడుపు గురుగు, మదనకట్టె, నూనెముంత, నానబ్రాలు,

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

కొండు గురుగుపాల, పెండలం, పొర్లుగాడి, నల్లపూల, ఇసుకచెంచలి, కందికార, గిలక, కన్నెకొమరు, ఎద్దుమట్టాకు, వెన్నవెదురు, లంజెసవరము, వెట్టిపూల, చిట్టబొట్ట, గోళ్లగొండి, కట్టలము, నల్లతీగ మొదలైన తీగజాతులను చెప్పాడు.[6] వీటిలో కొన్నింటిని క్షైఫియత్తులు కూడా వాడ్రుచ్చాయి. ఈ పేర్ల చివర 'అలము' అనే పద ప్రయోగం ఉంది. 'ఆకు–అలము' అనే జంటపదాలు రాయలసీమ మాండలికంలో చాలా ప్రసిద్ధి.

ఇన్నిరకాల వృక్షాలు, చెట్లు, తీగలు, కంపల రకాలను నారాయణామాత్యుడు చెప్పినట్లే వివిధ రకాల పుష్పాలను పింగళిసూరన చెప్పాడు. శాలీనుడు అత్తగారింట తోటలో సాగుచేసిన వనంలో పూలరకాలు ఉన్నాయి. "తులసీ, చెంగలువ, మొగలిపొద (కేదంగ), చంపకములు, సంపెంగలు, ఎఱ్ఱగోరింటలు (కురువ కంబులు) లవంగాలు, సన్నజాజులు, విరజాజులు, మాదీఫల తరువులు, గులాబీలు (గొజ్జంగులు) మల్లెలు, సురంగ తరువులు, పాటల పుష్పాలు, అరటితోపులు, తుంగదుబ్బులు, నారంగములు (బహుశా నారింజలు) వంటి పూలతోటల్లో శాలీనుడు చెమటలు చిందించాడు.[7] హంసవింశతి కూడా అనేకరకాలైన పువ్వులను తెలియజేస్తోంది. "సంపెంగలు, మొల్లలు, జాజులు, గన్నేరులు, విరజాజులు, గోరింటలు, ప్రొద్దుతిరుగుడుపూలు, పొన్నలు, మల్లెలు, పారిజాతాలు, చేమంతిపూలు, తామరలు, సూర్యకాంతపుష్పాలు, కలువలు, బొండుమల్లెలు, పొగడలు, అల్లిపూలు, నందివర్ధనాలు, వాడగన్నేరులు, మాచిపత్రి, గగ్గెరపూలు, మరువము, కురువేరు (ఇదివేరు) దవనము, వట్టివేరు, మారేడు" మొదలైన కుసుమాలు[8] ఉద్యానవనాలు, తోటలు, అడవులలో పుష్పించేవి. ఇటువంటి పూల వనాలలో ఉండే తుమ్మెదలను పారిజాతాపహరణము (3–51) తెలియజేసింది. అడవులను అన్ని ప్రముఖ ప్రబంధాలు వర్ణించాయి (కళాపూర్ణోదయం 4–78, మనుచరిత్ర 2–319 వసు చరిత్ర 2–21).

ఈ అడవులు వసంత ఋతువులో ఎంత అందంగా ఉంటాయో కూడా ప్రబంధాలు అద్భుతంగా వర్ణించాయి (ఆముక్త మాల్యద 5–99, 104, 114; మనుచరిత్ర 6–27, వసు చరిత్ర 1–126).

ఆనాటి ఉన్నతవర్గాల భోగలాలసజీవితం ఎలా ఉండేదో రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ 'రాయలనాటి రసికత' వ్యాసంలో లోతుగా చర్చించారు.

ధూర్జటి కానలో దొరికే రకరకాల పండ్లను చెప్పాడు

సీ॥ నేరేడు పండులు నెలయూటిపండులు గొండమామిడి పండ్లు దొండపండ్లు

బాలపండులు నెమ్మిపండులు బరివంక పండులు జిటిముటిపండ్లు గలివె

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

పండులు దొడివెందపండ్లు దుమ్మికిపండ్లు జానపండులు గంగిరేనుపండ్లు
వెలగపండ్లు పుల్లవెలగపండ్లు మోవిపండ్లు నంకెనపండ్లు బలుసుపండ్లు
బీరపండ్లును బిచ్చుకబీరపండ్లు గొమ్మి పండ్లీత పండ్లును గొంజిపండ్లు
మేడిపండ్లు మొదలుగా …”[9]

ధూర్జటి చెప్పిన అన్ని రకాల పండ్లను కైఫియత్తులు కూడా చెబుతున్నాయి. పై పద్యంలో గంగరేణుపండ్లను **దువ్వూరి కైఫియత్తు** “గంగరేగుచెట్లు అనగా గొప్పపండ్లు అవుతున్నవి” అని ప్రత్యేకంగా చెప్పింది. గంగరేణు పండ్లను పొలాల్లో పండించేవారని కైఫియత్తు సాక్ష్యం చెబుతోంది.

ధూర్జటి చెప్పిన ఫలజాతులకు తోడుగా నారాయణామాత్యుడూ మరికొన్ని రకాల ఫలాలను చెబుతున్నాడు.

సీ॥ పనస సీతాఫలాల్చిన నిమ్మగజనిమ్మ దూదినిమ్మయు నారమాదిఫలము
నారదఖర్జూర నారికేళాదులు రామఫలంబులు జేమఫలంబులు
లలరారు బొంతకిత్తళియు బోకయుబోక పిప్పిలి నేరేడు పెద్దవెలగ
రామావళియు గమరక జీడిమామిడి బాదంగి పెనురేగు పాలఫలము

గీ॥ చెట్లు పండేటి తోటలు చిట్టుగొట్టు
చెఱకు రసదాళిచెఱకెట్ల చెఱకు నల్ల
చెఱకు తోటలు కలుజోడ్లు సీర్పిదినుసు
కారపాకు తోటలు గలవతనికి[10]

చిననిమ్మ, గజనిమ్మ రకాలను ఊరగాయలలో కూడా ఉదహరించాడు. దూదినిమ్మ అంటే బత్తాయి పండు. దీనిని రాయలసీమలో చీనీపండు, దూదినిమ్మ పేర్లతో పిలుస్తారు. ఇది కూడా సిట్రస్ జాతిచెట్టు. రామాఫలము, సీతాఫలము లాంటిదే. సీతాఫలము కన్నా పెద్దగా ఉంటుంది. దాదాపుగా అదే రుచితో ఉంటుంది. ధూర్జటి, దువ్వూరి కైఫియత్తులో చెప్పిన గంగురేగు (గంగిరేగు) పండునే హంసవింశతి పెద్దరేగు (పెను రేగు) గా చెబుతోంది. పద్యంలోని పోకచెట్లు ఫలవృక్షాలు కాదు.

పనస, సీతాఫలం, రామాఫలం, చిననిమ్మ, గజనిమ్మ, దూదినిమ్మ, నారమాదీ ఫలం, నారదఫలం, ఖర్జూరం, నారికేళం, జేమ (జామ), బొంతకిత్తళి, పిప్పిలి, నేరేడు పెద్దవెలగ, గమ, జీడిమామిడి,

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

బాదంగి, పెద్దరేగు, పాలవంటివి పండ్లతోటలు. చిట్టిగోట్టు, చెరకు, రసదాళి, ఎర్రనల్లచెరుకు, కలుజోడులతో పాటు ఇతర దినుసుతోటలు కూడా రాయలసీమలో ఉండేవి.

సిద్ధవటం కైఫియత్తులో చెప్పిన పండ్లరకాలన్నీ నారాయణామాత్యుడూ చెబుతున్నాడు. హంసవింశతి పద్యం చివరి పాదంలో చెప్పిన "దినుసు కారపాకు తోట" ను **సిద్ధవటం కైఫియత్తు**కూడా ఉదాహరిస్తోంది. కరివేపను వంటల్లో ఆనాటికే ఉపయోగించారని హంసవింశతీ చెబుతోంది.

జామ పండు దేశీయమైనది కాదు. ఇది విదేశాల నుండీ భారత దేశంలోకి వచ్చినది. అమెరికా, మెక్సికో దేశాలలోని అడవుల్లో పండేది. మెక్సికో దేశంలో దీనిని "గుయాబా" అంటారు. కొలంబస్ అమెరికా ఖండాన్ని కనుక్కోవడంతో మిగతా ప్రపంచానికి పరిచయమయ్యింది. "అమెరికాలో ఉల్లిపాయ రంగులో ఉండే "సస్టా బెర్రీజామ" ను 17వ శతాబ్దంలో మెక్సికో దేశం నుండీ డచ్‌వాళ్లు మొదట మలేసియాకి తెచ్చి సాగుచేస్తే అది లేత పసుపురంగులో పండింది. మలయాభాషలో దాన్ని "జంబూ బటూ" అంటారని డా॥ జి.వి.పూర్ణచందు గారు చెప్పారు [11]. ప్రారంభంలో అమెరికన్ ఇంగ్లీషులో దీనిని Guava Apple అనే వారు. శీతల మండలంలోని ఇంగ్లీషు వారికి ఎక్కువ పండ్లరకాలు తెలీవు. అందుకే వారు చాలా పండ్లరకాలకు Apple పదాన్ని తగిలించేవారు. వెలగపండు (Wood Apple), సీతాఫలం (Custard Apple), అనాసపండు (Pine Apple), తాటిముంజెలు (Ice Apple) మొదలైనవి. ఇలాగే జామ ఫలానికి కూడా Apple పదాన్ని కలిపి పలికేవారు. క్రమంగా ధ్వని పరిణామం జరిగి Apple పదం జారిపోయి Guava పదం మాత్రమే మిగిలింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే మలయ భాష ప్రభావం వల్ల భారతదేశంతో పాటు ఆంగ్లంలో కూడా 'జావ' (Guava) అని పలుకుతున్నారు. కానీ ఆంగ్లభాష రాతలో 'గుయావా' (Guava) అని రాసి జావ అని ఉచ్చరిస్తారు. "గుయావా/గుయాబా" గా రాయడం మెక్సికన్ ప్రభావంతోనే సుమా! ధూర్జటి చెప్పిన ఫలరకాలలో 'జామ' లేదు. నారాయణామాత్యుడు దీనిని 'జేమ' అని చెప్పాడు. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యాన్ని క్రీ.శ. 1530-31 కాలంలో రాశాడు. హంసవింశతి క్రీ.శ. 1800 నాటిది. ఈ మధ్యకాలంలోనే జామ మన దేశంలోకి వచ్చింది.

ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాల నుండీ మొక్కజొన్న, మిరప, బొప్పాయి, జామ, టమోటా, బంగాళదుంప మిగతా ప్రపంచంలోకి ప్రవేశించాయి. అదేవిధంగా అనాసపండు (Pine Apple) కూడా అక్కడినుండి వచ్చినదే. క్రీ.శ. 1548లో భారతదేశంలోకి వచ్చినదని చెబుతారు. కానీ నారాయణామాత్యుడు మాత్రం దీనిని ప్రస్తావించలేదు. కనీసం కైఫియత్తులలో కూడా దీని ప్రస్తావన లేకపోవడం ఆశ్చర్యంగా

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

వుంది. సతతహరితారణ్యాలు, నిరంతర వర్షపాతం ఉన్నచోట్ల అనాస చక్కగా పండుతుంది. వర్షఛాయ ప్రాంతమైన రాయలసీమ దీనికి అనుకూలం కాకపోవడం వల్ల ఇక్కడ ఎవరూ ప్రస్తావించలేదు. ఐరోపాలో 1660 ప్రాంతంలో దీనిని పైన్‌కోన్‌గా పిలిచారు. అదికాస్తా ఆంగ్లంలో Pine Apple అయ్యింది. డచ్‌వారు దీనిని మనదేశానికి తీసుకొచ్చారు. ‘అనాస’ పదం కూడా డచ్ భాషా పదమే! అయితే కైఫియత్తులు, కావ్యాలలో అనాస ప్రస్తావన లేదు.

పర్వతాలలో, అడవులలో ఉండే మృగజాతులను, పక్షులను కూడా **సిద్ధవటం కైఫియత్తు** చెప్పింది

| | | | | |
|---|---|---|---|---|
| పెద్దపులి | చిరుతపులి | చిండుగ | అడవిపంది | |
| యేందు | ఎలుగుబంటి | కరింగొల | తోడేలు | |
| దుప్పి | కణతు | జింక | కుందేలు | |
| గుంటనక్క | కొండగొర్రె | రేచు (అడవికుక్కలు) | కారుపోతు | పునుగుపిల్లులు |

**ధోడియం కైఫియత్తు**లో కొనగండ్లు, కొండకోతులను ప్రస్తావించారు. అదేవిధంగా **పాయకట్టు కైఫియత్తు**లో గండ్రంగులు, ఉడుములను తెలియజేశారు. **చెన్నూరు కైఫియత్తు**లో నల్లకోతులను చెప్పారు. అహోబిళం కైఫియత్తు ‘చవులపిల్లి’ ని ప్రస్తావించింది. చవులపిల్లి / చెవులపిల్లి అంటే కుందేలు. కుందేలును రాయలసీమలో చెవులపిల్లిగా పిలుస్తారు. ఇది రాయలసీమ మాండలిక పదం.

**పక్షులు**

| | | | |
|---|---|---|---|
| గరుత్మంతుడు | నారాయణపక్షి | భరద్వాజపక్షి | నీరుకొంగ |
| నెమలి | నేలనెమలి | కౌజు | బెగ్గ్ర |
| కొక్కెర | కారుకోడి | కాకి | కంకణం |
| గువ్వ | పాల | పైదిగంటె | నీళ్ళబుచ్చిగ |
| పూరేడు | పిచ్చుక | టిట్టిభం | గూడకొంగ |
| పావురాయి | లావుక | చిలువ | జీనువాయి |
| కోకిల | కొండగొర | చిలుక | చెంచెలపుడేగ |
| జీలుగ | గుడ్లగూబ | చిలువ | గెరిజెలు |
| యాలపుడేగ | భైరిడేగ | మైనగొర | బెళవాయి |
| లకముక / లకుముకి | పికిలి | వారణపుడేగ | గద్ద |
| బందు | నల్లలు | కొంగ | |

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

నారాయణపక్షి ఒక నీటిపక్షి, నదులు, వాగులు, వంకలు, చెరువులు, కుంటలు, కాలువలలో ఆహారాన్ని సంపాదించుకుంటుంది. దీనిని ఆంగ్లంలో గ్రేహెరాన్ అంటారు. భరద్వాజ పక్షిని సాంబారు కాకి, జెముడు కాకి అని రాయలసీమలో వ్యావహారికమైన పేర్లతో పిలుస్తారు. దేహమంతా నల్లని రంగుతో, రెక్కలు కన్నులు ఊదా రంగుతో ఉంటుంది. జానపద వైద్యంలో దీని మాంసానికి చాలా ప్రసిద్ధి ఉంది. గరుత్మంతుడు పక్షికి విష్ణువు వాహనంగా ఐతిహాసిక ప్రశస్తి వుంది. ఈ మూడు పక్షులు శేషాచలం అడవుల్లో విస్తారంగా వున్నాయి. రాజంపేట, కోడూరు ప్రాంతాన్ని మధ్యయుగంలో పులుగులనాడుగా పిలిచారు. ఈ మూడు పక్షులు ఎక్కువగా వున్నందునే పులుగులనాడుగా ప్రచారం అయ్యిందని పరిశోధకులు నిరూపించారు. అదేవిధంగా గుడ్లగూబ లక్ష్మీదేవి వాహనం. సమీపంలోనే వైష్ణవ క్షేత్రమైన తిరుమల వుండడం వల్ల, ఈ పక్షులకున్న పౌరాణిక ప్రాముఖ్యత వల్ల కూడా ఈ ప్రాంతం పులుగులనాడుగా వినుతి కెక్కడానికి అవకాశం వుంది.

**పాయకట్టు కైఫీయత్తు**లో మరిన్ని పక్షిజాతుల ప్రస్తావన వుంది.

| | | | |
|---|---|---|---|
| కారుకోళ్ళు | బోదము | పైండికంటెలు | ఉల్లంగి |
| చీకురాయి | పాలకలు | పూరేళ్ళు | శీతవలు (తీతువు పిట్టలు) |
| సాలువడేగలు | గోరువంకలు | జలపిట్టలు | |

హంసవింశతి ఎన్నో పక్షుల పేర్లను ఉదహరిస్తోంది.

“గరుడ, సంపాతి, గండభేరుండ, చీకురాయి, ఆడేలు, చెవులపండ, వార్యము, బైరి, జావళము, సాళ్వము, డేగ, గూడబాతు, ఉల్లంగి, కుందటీల, పాల, నారాయణపక్షి, పాముల మ్రింగుడు, అంచ వేష్టము, గ్రద్ద, క్రౌంచము, అబలగులోదె, గౌరకు, తెల్లనిపంత, బలనట్టె, గూబ, గుబిలిగాడు, నామాకేతడు, నల్లస, కప్పెర, అంబెటి దారిగాడు, మూగచిందర, లకుముకి, చిఱుత, తీతువ, కారుకోడి, ఏకులనారిగాడు, మునుగుకోడి, అలముట్టెకోడి, బోద, పొన్నంగి, కకళేటి, బొల్లికోడి, గొంగడి, కక్కెర, గొక్కెర, గొరవంక, పూరేడు, కనుపెంటి, నీరుకాకి, వెలిచె లావుకపిట్ల చిలుక, జీనువ, కౌజు, పెడన, కేర్జము, డబ్బు, బెలమ, నెమిలి, జిట్టువ, మునుగపూజట్టున, గిజిగాడు, వల్లడ, పొడపిట్ట, వంగపండు, బరతము, కోయిల, పసరికె, తంగెడు, చిక్కెన, చెఱువుకోడి, పట్టుజీనువు, కొంగ, పాపేరు పిచ్చుక, పోలిక, పికిలి (పిక్కిలి), మీలమ్రుచ్చు, చిలుక, చకోరం, జబ్బుటాయి, జటాయువు, కొండపిచ్చుక, వానకోయిల, మానుపొక్కటిగాడు, మలకాకి, బెనాసి, పాపెర, పందికైర, గబ్బిలం, చాతకం, కంకచిటిచెల్వ, పొనుపెంటి,

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

మేత్రింత, భూతపోతు, గున్నంగి, కనకాక్షి, గుడిసె, బయ్యకపుల్ల, సీతువ, బెగ్గురు, జిక్కుతురక, నేలనెమలి, పెనుగువ్వ, బకదారి, పావురాయి, సివడు, పలువరింత, చదలుకోడి, వదరుతోకల వేడి” మొదలైనవి.

వీటిలో కొన్ని పునరావృతమయ్యాయి. వందకుపైగా పక్షుల పేర్లను నారాయణామాత్యుడు నమోదు చేశాడు. సిద్ధవటం, పాయకట్టు కైఫియత్తులలోని అన్ని పేర్లు ఇక్కడున్నాయి. కాకపోతే కొన్ని సంస్కృతనామాలతో ఉన్నాయి. సంపాతి, గండబేరుండ, జటాయువు, చకోరం పక్షులు కవి సమయాలే తప్ప వాస్తవంగా ఈ భూమిమీద లేవు. నారాయణామాత్యుడు వీటిని అతిశయోక్తిగా చెప్పాడు. వీటిలో హంసలేదు. హంస ఈ వాతావరణంలో జీవించలేదు.

పై వరుసలో అచ్చమైన రాయలసీమ భాషా అస్తిత్వ మాండలిక పేర్లు ఉండటం ముదావహం. జంతువులు మరణిస్తే వాటిని తినే రాబందులను రాయలసీమలో ‘పంత’ గా పిలుస్తారు. చెవులపంత మెడకు ఈకలుండె రాబందు. తెలుపంత (తెల్లని పంత) మెడకు ఈకలులేని రాబందు. రెండింటినీ నారాయణామాత్యుడు చెప్పాడు. కొందరు పొరబడినట్లు చెవులపంత అంటే జెముడుకాకి కాదు. గ్రద్ద జాతి అంతకన్నా కాదు. ఇది రాబందు. అదే విధంగా ‘జిట్టువ’ పిచ్చుకజాతి పిట్ట. పొలాలు, అడవులలో వుండే వాటిని ‘జిట్టువ’, ‘నేల జిట్టువ’ పేర్లతో పిలుస్తారు. ఇది పిచ్చుక జాతి పిట్టే కానీ పిచ్చుక మాత్రం కాదు. జిట్టువ లేదా నేలజిట్టువ నేలమీద, రాళ్ళ సందుల్లో చిన్నగా మెత్తని బొచ్చు (గూడు) పెట్టి అందులో గుడ్లను పొదుగుతుంది. చిన్నచిన్న మొక్కలు, తీగల కింద గూడును ఏర్పాటు చేసుకొని గుడ్లు పెట్టేది పూజిట్టువ. గుబ్బిలిగాడు, అంబెటిరారిగాడు, ఏకులనారిగాడు పేర్లలో ‘గాడు’ పదంతో కొన్ని పక్షులను రాయలసీమలోనే పిలుస్తారు. ఈమూడింటితో పాటు ‘బెల్లగాడు’ అనే పేరుతో ఒక పావురం జాతి పక్షిని కూడా పిలుస్తారు. ‘గూగూగూ’ అనే దీని అరుపు చాలా ప్రసిద్ధం! దీనినే సిద్ధవటం కైఫియత్తు ‘బెళవాయి’ గా చెప్పింది. హంసవింశతి ‘బెగ్గౌరు’ గా పిలిచింది. ఈ మూడు పేర్లూ నేటికీ వాడుకలోనే ఉన్నాయి. అదేవిధంగా గబ్బిలంతో పాటు జిబ్బటాయిని హంసవింసతి చెప్పింది. కానీ ఇవి రెండూ ఒకటే! గబ్బిలాన్ని రాయలసీమలో జిబ్బటి, జిబ్బటాయిగానే పిలుస్తారు. అలాగే తీతువుకోడి, సీతువ వేర్వేరు గాదు, రెండుపేర్లూ ఒక్కటే! సీతవ / సీతువగానే స్థానికంగా వ్యవహరిస్తారు.

ఇంకో అద్భుతమైన మాండలికమైన పేరు కూడా వీటిలో ఉంది. అది ‘కప్పెర’! వడ్రంగి పిట్ట రాయలసీమలో కొప్పెర / కప్పెరగువ్వగా, కొప్పెర గువ్వ విస్తృతంగా వ్యవహారంలో వుంది. వడ్రంగిపిట్ట అనే పేరుకు రాయలసీమలో ప్రచారమే లేదు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

అదే విధంగా చెఱువుకోడి వేరు, నీటికోడి వేరు. చెఱువు కోడిని బుడకోడి అని గూడా అంటారు. దీనిని మిగిలిన ప్రాంతాలలో ‘బాతు’ గా పిలుస్తారు. దీనిని పోర్చుగీసులు భారతదేశంలో ప్రవేశపెట్టారు. బాతు పదం పోర్చుగీసు భాషాపదం. ఆముక్తమాల్యద ‘బాతువు’ అని వ్యవహరించింది. [13] శ్రీకృష్ణదేవరాయలకాలంలోనే ఇది మనదేశంలోకి అడుగుపెట్టింది. పోర్చుగీసులు రాకముందు ఈ పక్షి గురించి మనకు తెలీదు. అందుకే తత్సమంలో ‘బాతువు’గా రాయలు చెప్పాడు. మిగిలిన ఆంధ్రదేశం క్రమంగా ‘బాతు’గా స్వీకరించింది. రాయలసీమ మాత్రం చెరువుకోడి లేదా బుడకోడిగానే నేటికీ పిలుస్తోంది. అయితే రాయలసీమేతర ప్రాంతాలలో నీటికోడిఅనీ, చెరువుకోడిఅనీ ఒకటిగానే పిలుస్తారు. ఆ ప్రాంతాల్లో బాతుపదానికి పర్యాయపదంగా చెరువు కోడిని వ్యవహరించడం లేదు. రాయలసీమలో మాత్రమే చెరువుకోడి, బుడకోడి పేర్లతో బాతుని గుర్తిస్తారు. ‘బాతు’ పదం కూడా వాడుకలో ఉన్నప్పటికీ ఈ పదాలకే ప్రచారమెక్కువ. కైఫియత్తులు, హంసవిశంతి చెప్పిన అనేకమైన పక్షుల పేర్లను నేడు గుర్తించడం సాధ్యం కాని విషయం.

నారాయణామాత్యుడు అసంఖ్యాకమైన పక్షి జంతుజాలాన్ని రకరకాల పంటలను వివరించడమే గాక చేపలపేర్లు, వివిధాలైన జలచరాలను సైతం నమోదు చేశాడు. “కొరద, దాసరికొయ్య, కొర్రమీను, ఉలస, ముచ్చంగి, బేడిస, జెల్ల, చారమీను, వాలుగ, ముకుదొమ్మ, వల్లికతట్ట, పుత్తడికాసు, పూమీను, కడిసెలము, పక్కె, చిత్తర, నీరుపాపెర, మలుగుమీను, అరుజు ఇల్లెపుచేప, ఆకుజెల్ల, మిసి, కల్లురుజు, నడమీను, తొల్లిక, రాతిగొరక, మాపురము, గుంటముక్కు మోరపక్కెర, దొందు, కూరముక్కు పుల్లరుజు, గెజ్జిగెండె, బొమ్మడాయి, అల్లెద, ఉప్పుచేప, గొల్లదొందు, పరిగె, రొయ్య మొదలైన చేపలరకాల పేర్లను చెప్పాడు. [14]

ఈ చేపలన్నీ రాయలసీమ నదులు, వాగులు, వంకలు, మడుగులు, చెరువులలో లభించేవి. చివరన చెప్పిన రొయ్య చేపకాదు. కొరదనే కొడద అని కూడా అంటారు. ఇదే కొర్రమీను కూడా! కవి వీటిని వేర్వేరుగా చెప్పినా రెండుపేర్లు ఒక చేపకు చెందినవి. ఉలస చేపను ఉలిచి అనీ పిలుస్తారు. కొత్త నీటికి ఎదురీత చేసినా బురద మడుగులలో స్థిరపడతాయి. బేడిసలు వాగులు వంకలలో ఈదుతూ తెల్లగా పొడువుగా సన్నగా ఉంటాయి. పక్కెచేపను బుడ్డపక్కి అని కూడా వ్యవహరిస్తారు. ఇవి చాలా ఎక్కువగా గుంపులు గుంపులుగా ఉంటాయి. రుచిలో కాసింత చేదుగా ఉంటాయి. జెల్లలు చాలా రుచికరంగా ఉండి భోజన ప్రియులకు నోరూరిస్తాయి. జెల్లలకు ఉండే పొడవైన మీసాలు ముల్లుల్లాగా

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

గుచ్చుకుంటాయి. ఆశ్వీయుజం, కార్తీకం నెలల్లో (ఈశాన్య ఋతుపవన సమయం) కొత్త నీటికి ఎదురు ఈదుతూ గుడ్లను పెడతాయి. గుడ్లతో ఉన్న జెల్లలు రుచిగా ఉంటాయి. వీటిలో పారేనీటిలో ఉండేవి జెల్లలు, నిలవనీటిలో ఉండేవి ఆకుజెల్లలు. ఇసుకతో ఉండే వంకలలో పొడవుగా చిన్నగా ఉండేవి దొందులు. ఇసుక వాగులలో ఉండి ఇసుకలో దాక్కోవడం వల్ల ఇసుకదొందులని, బురదవాగుల్లో ఉన్నవాటిని గొల్లదొందులుగా పిలుస్తారు. బొమ్మిడాయిల పులుసు నేటికి చాలా ప్రసిద్ధి.

కాసులు, పుత్తడికాసులు నాణేల్లాగా మెరుస్తూ ఉన్నందున కాసులుగా పిలుస్తారు. వాలుగలను వాలువలనీ పిలుస్తారు. నారాయణామాత్యుడు చెప్పిన చేపలన్నీ మంచినీటి జలచరాలే! సముద్ర చేపలను చెప్పలేదు. అరుజు, పుల్లరుజు, కల్లరుజులు కూడా ఒకే రకమైన చేపకున్న మూడుపేర్లు. ఒకే చేపకు రాయలసీమలో భిన్న ప్రాంతాలలోని మాండలిక నుడుగులివి! అరుజుని అడుసు అనీ పిలవడానికి ప్రధాన కారణం ఇవి బురదనీళ్లలో జీవిస్తాయి. అడుసు అంటే బురద అనే కదా! అడుసులు పదమే ఉచ్ఛారణాత్వరణం వల్ల అరుజులుగా మారింది. ఇక్కడే చేపలతోపాటు ఇతర జలచరాలను కూడా హంసవింశతి చెప్పింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇక్కడ చేపలుపట్టే కొడమల వంటి సాధనాలను, వివిధ చేపల వలలను సైతం తెలియజేసాడు. నారాయణామాత్యుడు బ్రాహ్మణ పండిత వంశంలో పుట్టిన కవి. కానీ ఆయన అసాధారణంగా శూద్రజీవిత వైవిధ్యాన్ని ఉన్నతంగా వర్ణించాడు. ఒక విధంగా ఆయన బ్రాహ్మణశూద్రుడు. అనేకరకాల కులవృత్తులను, వృత్తుల పనిముట్లను, వివరించిన మహానుభావుడు.

అడవులు, గడ్డిమైదానాలు కూడా రాజుకు ఆదాయవనరులేనని శాసనాలు స్పష్టంగా వివరిస్తాయి. అందుకే గడ్డి మైదానాలమీద వేసే పుల్లరి పన్ను ప్రస్తావనలు శాసనాలలో విస్తారంగా కనిపిస్తాయి. గడ్డిమైదానాలలో అడవులలో పశువులు మేసే 104 పసుగ్రాస రకాలను హంసవింశతి చెప్పింది[16] పసుగ్రాసం కోసం యుద్ధాలు సైతం జరిగేవి. మనుమసిద్ధికి యాదవరాజయిన కాటమరాజుకి పుల్లరి పన్ను విషయం మీద తగువు జరిగింది. ఈ యుద్ధంలో తిక్కన సోమయాజి బంధువైన ఖడ్గతిక్కన చనిపోయాడు. ఈ విషయాన్ని పట్టపురావి, ఎంపెరాల, సిద్ధవటం, సిద్ధవట మాహాత్మ్యము కైఫియత్తులు తెలియజేస్తున్నాయి. కట్టా నరసింహులు వంటి పరిశోధకులు సైతం ఈ పుల్లరి యుద్ధాన్ని ధ్రువీకరించారు.

కాకతీయులు అసాధారణమైన అడవులను నరికి భూమిని చదును చేసి వ్యవసాయ యోగ్యంగా చేశారు. ప్రతాపరుద్రుని సేనాని సాహిణి నాగయ గంగయ ప్రస్తావన రాయలసీమ కైఫియత్తులలో అనేకసార్లు కనిపిస్తుంది. సాహిణి నాగయ గంగయ సాహిత్యంలో, ఢిల్లీ రాజకీయాలలో చాలా ప్రముఖుడు.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

మారన తన మార్కండేయపురాణాన్ని ఈ సాహిణి నాగయ గంగయ్యకే అంకితం చేశాడు. మారన ఉభయ కవి మిత్రుడైన తిక్కన సోమయాజికి శిష్యుడు. మార్కండేయ పురాణం తెలుగులో, అనువాదమయిన తొలి తెలుగు మహాపురాణం. నాగయ గంగయ కాకతీయ సామ్రాజ్యం పతనం తర్వాత ఇస్లాం మతంలోకి మారి 'మాలిక్ మక్బుల్' గా ఢిల్లీలో చాలా ముఖ్యపాత్ర పోషించాడు. ఆంధ్రదేశ పరిస్థితుల మీద అతనికి స్పష్టమైన అవగాహన ఉన్నందువల్ల ఢిల్లీ సుల్తాన్ అతన్ని తిరిగి ఓరుగల్లుకు పాలకునిగా నియమించాడు. ఓరుగల్లు అధికారిగా ఉన్న సమయంలో కూడా రాయలసీమలో అడవుల్ని నరికి వ్యవసాయాన్ని విస్తరించాడు. ఆ తర్వాత విజయనగర సామ్రాజ్య కాలంలో మరింత నేల సాగుబడిలోకి వచ్చింది. 17, 18 శతాబ్దాలలో రాయలసీమలో పాలేగాళ్ళు కూడా అరణ్యఛేదన చేసి వ్యవసాయం చేశారు. ఈ అడవుల్లోని వృక్షాలు, తీగలు, కంపచెట్లు, పుష్పాలు, పండ్లను ప్రబంధాలు, కైఫియత్తులు తెలియజేశాయి.

ఈ అడవులలో చెంచులు యానాదులు ఉండేవారు. కైఫియత్తులలో వీరి ప్రస్తావన రావడమే గాక "చెంచువారల యొక్క కైఫియత్తు" అనే ప్రత్యేకమైన కైఫియత్తు కూడా ఉండటం విశేషం. అహోబిలం అడవులలో ఒక విచిత్రాన్ని **"పుట్టుపాపల కైఫియత్తు"** వివరిస్తోంది. పొట్టిగా ఉండే ఇద్దరు నగ్నంగా అడవులలో తిరుగుతూ ఉండేవారని, వారికి మాటలురావని, అడవి జంతువుల మాదిరిగా అరుస్తూ ప్రవర్తిస్తారని ఈ కైఫియత్తు చెబుతుంది. బహుశా చిన్నవయసులో తల్లిదండ్రులకు దూరమైన పిల్లలు అలా తయారయి వుంటారు. ఉత్తరప్రదేశ్‌లోని కటార్నియా ఘాట్‌లో ఇలా తప్పిపోయి కోతులతో కలసి జీవిస్తూ, కోతుల్లాగా ప్రవర్తిస్తున్న ఒక అమ్మాయిని గుర్తించారు. ఆ అమ్మాయి ప్రస్తుతం లక్నోలోని 'నిర్వాన్' అనే పునరావాస కేంద్రంలో వుంది. 19వ శతాబ్దం చివరిలో మధ్యప్రదేశ్‌లోనూ ఒక వ్యక్తిని ఇలాగే గుర్తించారు. ఈవ్యక్తి స్ఫూర్తితో ప్రఖ్యాత ఆంగ్ల రచయిత రుడ్యార్డ్ క్లిప్పింగ్ "ది జంగిల్ బుక్" అనే రచన చేశారు. ఇటువంటి సంఘటననే పుట్టుపాపల కైఫియత్తు వివరిస్తోంది.

18వ శతాబ్దం వరకు వున్న రాయలసీమ అడవుల గురించి, వన్యప్రాణుల గురించి కైఫియత్తులే కాకుండా కావ్యాలు కూడా వివరించడం అద్భుతమైన విషయం. అందువల్ల ఆనాటి సామాజిక జీవితంలో అడవులు నిర్వహించిన పాత్ర విశిష్టమైనదని స్పష్టమౌతోంది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

**పాదసూచికలు:**

1) శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము 3-110
2) హంసవింశతి 1-234
3) హంసవింశతి 4-11
4) హంసవింశతి 4-10
5) హంసవింశతి 4-9
6) హంసవింశతి 5-43
7) కళాపూర్ణోదయము 4-79
8) హంసవింశతి 1-184
9) శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము 3-69
10) హంసవింశతి 4-134
11) ఆదివారం ఆంధ్రజ్యోతి 15 ఫిబ్రవరి 2026
12) హంసవింశతి 3-12
13) తలబక్షచ్చుట గుచ్చి బాతువులు 1-65
14) హంసవింశతి 4-182 నుండి 187 వరకు
15) హంసవింశతి 5-43 నుండి 5-47 వరకు

**ఆధారగ్రంథాలు:**

1) ఆరుద్ర, సమగ్ర ఆంధ్రసాహిత్యం 2,3 సంపుటాలు, తెలుగు అకాడమి, 2012.
2) నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం), నవ్యపరిశోధక ప్రచురణలు, హైదరాబాద్, 2011.
3) నాగయ్య, జి. దాక్షిణాత్య సాహిత్య సమీక్ష (ప్రథమ సంపుటం), ఫ్రీడమ్ ప్రెస్, మద్రాసు-9, 1976.
4) నారాయణస్వామి, బండి. రాయలసీమ సమాజం-సాహిత్యం, పర్‌స్పెక్టివ్, హైదరాబాద్-, 2019.
5) ప్రతాపరెడ్డి, సురవరం, ఆంధ్రుల సాంఘికచరిత్ర, సాహిత్య వైజయంతీ ప్రచురణ, హైదరాబాద్, 1950.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :10.16(2026); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer-Peer Reviewed, Refereed & Open Access International Journal - As per UGC Norms
(Fulfilled Suggests Parameters of UGC by IJMER)
Volume:15, Issue:4(2), April 2026
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed: Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available: www.ijmer.in

6) బలరామమూర్తి, ఏటుకూరి. ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1989.

7) బాష, ఎస్.ఎం. అనంతపురం సాంప్రదాయ నీటివనరులు, కదలిక ప్రచురణలు, అనంతపురం, 2004.

8) శ్రీనివాసులు, అంకే, అనంతపురం సాహిత్యం–కరువు, సిద్ధాంత గ్రంథం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం, 2011 (అముద్రితం)

9) సత్యనారాయణ, కంబంపాటి, ఆంధ్రుల చరిత్ర సంస్కృతి, హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 2020.

10) హనుమంతరావు, బి.యస్.యల్. ఆంధ్రుల చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2003.